

రాష్ట్రంలో శాంతి భద్రతలున్నాయా?
రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? అసలు మహిళలకు రక్షణ ఉందా? అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. -8లో



రాణించిన కడప బ్యాట్స్‌మన్
కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. తొలిరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 316 పరుగులు చేసింది. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.1/23.2
జిల్లాలో మంగళవారం 23.2 - 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సమావేశం
కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులతోపాటు ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోండి
కడప ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష-2025కి సంబంధించి 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లు భర్తీ చేయుటకు 8వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల యాజమాన్య ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. మీ పాఠశాలలో అర్హత గల విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈఓ తెలిపారు.

మైలవరం నుంచి పెన్నాకు నీటి విడుదల
జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి మరోసారి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఈఈ యు.రమేష్ పేర్కొన్నారు. అనంతపురం ప్రాంతంలో కురిసిన వర్షాల నేపథ్యంలో వరద నీరు గండికోట జలాశయంలోకి చేరుతోంది. గండికోట నుంచి అధికారులు దిగువన ఉన్న మైలవరం జలాశయంలోనికి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మైలవరం జలాశయం నుంచి మంగళవారం ఉదయం మూడు వేల క్యూసెక్కులు పెన్నానదిలోకి వదిలామని.. సాయంత్రం ఆరు వేల క్యూసెక్కులు వదిలామని ఈఈ రమేష్ తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
కడప అగ్రికల్చర్: తుఫాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా కొండాపురంలో అత్యధికంగా 61.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరులో 37.4 ఎంఎం, సింహాద్రిపురంలో 35.4 ఎంఎం, పులివెందుల్లో 32 ఎంఎం, లింగాలలో 23.4 ఎంఎం, చక్రాయపేటలో 23.2 ఎంఎం, అట్లూరులో 22 ఎంఎం, కమలాపురంలో 21.6 ఎంఎం, వేములలో 18 ఎంఎం, వల్లూరులో 12.8 ఎంఎం, పులివెందుల్లో 9.2 ఎంఎం, తొండూరు, కలసపాడులలో 6.2 ఎంఎం, బిమఠంలో 5.2 ఎంఎం, ఖాజీపేటలో 4.2 ఎంఎం, కాశినాయనలో 4 ఎంఎం, ముద్దనూరులో 3.4 ఎంఎం, పెండ్లిమర్రిలో 2.4 ఎంఎం, జమ్మలమడుగులో 1.4 ఎంఎం, ఎర్రగుంట్ల, బి.కొడూరు, వేంపల్లిలో 1.2 ఎంఎం, రాజుపాలెంలో 1 ఎంఎం, బద్వేల్‌లో 0.4 ఎంఎం వర్షం కురిసింది.

దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగిలిన సీట్ల భర్తీకి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్ పాస్, ఫెయిల్‌లతోపాటు ఆపై అర్హత కలిగిన వారు కూడా అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ అప్లికేషన్లను ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అప్లికేషన్ రిజిస్ట్రేషన్‌కు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫోటో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని తాము చేరదలచుకున్న ఐటీఐల వద్దకు వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన ఐటీఐను రిజిస్ట్రేషన్ సమయంలోనే ఎంపిక చేసుకోవచ్చన్నారు. అప్లికేషన్‌ను ఈ నెల 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

వాటర్‌గ్రిడ్ పనుల పరిశీలన



వాటర్ గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు

లింగాల: లింగాల మండలం పార్నపల్లె చిత్రావతి సమీపంలో రూ.374కోట్లతో నిర్మిస్తు న్న వాటర్ గ్రిడ్ పనులను మంగళవారం నాబార్డు అధికారులు పరిశీలించారు. నాబార్డు జీఎం సహాడి సింగ్, అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ విజయ్ విహారిలు పరిశీలించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న నీటి శుద్ధి కర్మాగారాలను, వాటర్ ట్యాంకులను, పైపులైన్లను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడు కొండలు పనుల నిర్వహణపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

అయ్యవార్లకు ఇదేమి శిక్షణ!

- సర్కారు బడులకు శాపంగా మారిన వృత్యంతర శిక్షణ
- ఒక్కో ఉపాధ్యాయుడికి 6 రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ
- పాఠశాల పనిదినాల్లో జరపడంతో విద్యార్థులకు తీరని నష్టం
- రెండు మూడు జిల్లాలకు ఓ చోట.. రాష్ట్రవ్యాప్తంగా 9 కేంద్రాలు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనున్న శిక్ష(ణ)లు



నగర శివారులోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో వృత్యంతర శిక్షణా తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, కడప: ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న వేళ సైతం విద్యావ్యవస్థలో శిక్షణల పేరుతో ఇంకా పాతకాలపు పద్ధతులనే కొనసాగిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడి చేతిలో ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, ఇళ్లలో పర్సనల్ కంప్యూటర్ వాడకం తప్పనిసరి అయిన ఈరోజుల్లో కూడా ఆన్‌లైన్ శిక్షణలను గాలికొదిలి రెసిడెన్షియల్ శిక్షణలకే మొగ్గుచూపుతున్నారు. పాఠశాల పనిదినాల్లో వేల మంది ఉపాధ్యాయులను వారాలపాటు బడులకు దూరం చేయడం సమంజసం కాదని ఉపాధ్యాయ సంఘాలు నెత్తిన నోరు పెట్టుకుని మొత్తుకున్నా.. వారి మాటను ఇసుమంతైనా లెక్కబెట్టకుండా శిక్ష(ణ)లను కొనసాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 4 నెలలపాటు ఎఫ్ఎల్ఎన్‌పై జరిగే ఈ శిక్షణలకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకుండా ఉపాధ్యాయులందరూ హాజరై తీరాల్సిందేనంటూ హుకుం జారీ చేసింది. రెండు మూడు జిల్లాలకు కలిపి ఓచోట శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేసి 6 రోజుల పాటు అయ్యవార్లను అక్కడే మగ్గబెడుతున్నారు. ఓవైపు సర్కారు బడులకు డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లను సరఫరా చేస్తూ.. మరోవైపు అయ్యవార్లకు మాత్రం పాతకాలపు మూస పద్ధతిలో ముఖాముఖి శిక్షణలను కొనసాగించడంపై విద్యావేత్తలు సర్వత్రా పెదవి విరుస్తున్నారు. ఇవి తమ పనితీరును మెరుగుపరిచే శిక్షణలో లేక కోరి తెచ్చుకున్న ప్రభుత్వం చేతిలో శిక్షలో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ వర్గం వాపోతోంది.

14 విడతల్లో 34 వేల మందికి శిక్షణ ..
ప్రాథమిక పాఠశాలల్లో చదివే పిల్లలకు భాష, గణితంలో అభ్యసన సామర్థ్యాలను మరింత పటిష్టం చేసేందుకు వీలుగా టీచర్లకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అనే అంశంపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఉన్నాయి.
- ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే 34 వేల మంది టీచర్లను 14 బ్యాచ్‌లుగా విభజించి ఒక్కో బ్యాచ్‌కు 6 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతలో అక్టోబర్ 21 నుంచి 26వ తేదీ వరకు 2,700 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. రెండు మూడు జిల్లాల వారిని ఓ చోటకు చేర్చి, అక్కడ ఓ విద్యాకేంద్రంలో వారిని ఉంచి రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణను ఇస్తున్నారు. అంటే ఆ ఉపాధ్యాయులకు తరగతులు, భోజనం, వసతి, బస అన్నీ అక్కడే. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అనారోగ్య అయ్యవార్లకు ఇబ్బందికరమే..
పట్టణానికి దూరంగా ఓ విద్యా కేంద్రంలో శిక్షణ తీసుకోవాలంటే ఉపాధ్యాయులకు నిజంగా ఇది పెద్ద శిక్షే. 6 రోజులపాటు వారిని ఆ విడిది వదిలి రానివ్వమని ముందే చెబుతున్నారు. రిటైర్‌మెంట్ దగ్గరున్న వారు, చిన్న పిల్లల తల్లులకు, అనారోగ్య సమస్యలున్న వారికి సైతం ఈశిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వకుండా అందరూ హాజరు కావాలనడం వారిని ఇబ్బంది పెట్టడమేనని పలువురు వాపోతున్నారు.

ఇలాగైతే సర్కారు బడులలో పిల్లలను చేరుస్తారా?
పాఠశాల పనిదినాల్లో టీచర్లను వారాలకొద్దీ బడులకు దూరం చేసే ప్రజలు తమ పిల్లలను సర్కారు బడులలో చేర్చడానికి ఎంతవరకు మొగ్గుచూపుతారో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. రాష్ట్రంలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్న ప్రాథమిక పాఠశాలలు 70 శాతం వరకు ఉన్నాయి. ఇద్దరు పనిచేస్తున్న పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు వారం, మరొకరు వారం రోజులపాటు శిక్షణకు వెళితే నెలలో సగం రోజులు అక్కడ ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పాలి. విద్యా సంవత్సరానికి గుండెకాయ లాంటి నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇలాంటి పరిస్థితి ఏర్పడితే 40, 50 మంది పిల్లలున్న బడిలో అర్ధనెల పాటు ఒకే ఉపాధ్యాయుడు పాఠశాల నడిపిస్తే అక్కడ విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లక తప్పదు. ఇక ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి అగమ్య గోచరమే.

ఉపాధ్యాయులపై అనుమానంతోనేనా..?
ఆధునిక సాంకేతిక పరుగులు పెడుతున్న ఈ కాలంలో ఇంకా రెసిడెన్షియల్ శిక్షణలేంటని మేధావి వర్గం ప్రశ్నిస్తోంది. ఆన్‌లైన్ శిక్షణలను ఉపాధ్యాయులు సరిగా పట్టించుకోకుండా అశ్రద్ధ చేస్తున్నారనే భావన ఒకవేళ ప్రభుత్వ పెద్దలలో ఉంటే.. అలాంటి అనుమానాలను కూడా సాంకేతికత నివృత్తి చేస్తుంది. ఉదాహరణకు ఇటీవల ఫిక్కి యాప్ ద్వారా ఉపాధ్యాయులకు కొన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆ యాప్ ప్రత్యేకత ఏంటంటే.. ఇచ్చిన అంశంలో మొదటి టాస్క్ పూర్తి చేస్తేనే రెండో టాస్క్ ఓపెన్ అవుతుంది. కనీసం అందులోని వీడియోను కూడా జంప్ చేయడానికి వీలుకాదు. 10 లేదా 20 నిమిషాల నిడివి ఉన్న వీడియోను పూర్తిగా చూసి అందులోని ప్రశ్నలకు ఉపాధ్యాయుడు సమాధానాలు ఇస్తేనే ఆ టాస్క్ పూర్తయినట్లు లెక్క. ఇలా అన్ని టాస్కులు పూర్తి చేసిన వారికే సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. ఏ మండలంలో ఎవరెవరు టాస్కులు పూర్తి చేయలేదో గమనించి అక్కడి రిసోర్స్ పర్సన్లు వారికి గుర్తుచేస్తూ ఉంటారు. ఒకవేళ ఇక్కడ కూడా ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించి సకాలంలో ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేయకపోతే.. అలాంటి ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలు ఇస్తే అందులో అర్థం ఉంటుంది. అంతేకానీ మొత్తం ఉపాధ్యాయులపై అనుమానం పెంచుకొని ఆన్‌లైన్ శిక్షణల మీద నమ్మకం లేకుండా అందరూ రెసిడెన్షియల్ శిక్షణకు హాజరు కావాలనడం సమంజసంగా లేదని మేధావి వర్గం అభిప్రాయ పడుతోంది.

తప్పనిసరైతే కాంప్లెక్స్ పరిధిలోనే శిక్షణ ఇవ్వాలి



ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణలే శ్రేయస్కరం. ఒకవేళ ముఖాముఖి శిక్షణ తప్పనిసరి అనుకుంటే నెలవారీ కాంప్లెక్స్ సమావేశాల్లోనే వాటిని చేపట్టాలి. దీర్ఘకాలిక రెసిడెన్షియల్ శిక్షణ వేసవి సెలవుల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి. అనారోగ్య సమస్యలున్న ఉపాధ్యాయులకు, చిన్న పిల్లల తల్లులకు ఈశిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలి. - సివి ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు, ఏపీటీఎఫ్ అమరావతి

నేడు జిల్లాలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.50 గంటలకు గుంటూరు పోలీస్ పెరేడ్ మైదానంలోని హెలీప్యాడ్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు బద్వేల్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి బద్వేల్‌లోని రామాంజనేయనగర్‌లో ఇటీవల ప్రేమోన్మాది పెట్రోల్ దాడిలో గాయపడి మరణించిన విద్యార్థిని దస్తగిరమ్మ నివాసానికి వెళ్లి ఆమెకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను పరామర్శిస్తారు. 2.10 గంటలకు దస్తగిరమ్మ నివాసం నుంచి బయలుదేరి 2.20 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.30 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.55 గంటలకు పులివెందులలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.20 గంటలకు పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు.

హెలీప్యాడ్ స్థల పరిశీలన



పి.పి.కుంట వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ తదితరులు

గోపవరం/అట్లూరు: ఈ నెల 19వ తేదీన ప్రేమోన్మాది దాడిలో మృతిచెందిన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చేందుకు బుధవారం బద్వేలుకు వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. బుధవారం గుంటూరు పర్యటన అనంతరం వైఎస్ జగన్ హెలికాప్టర్ ద్వారా బద్వేలుకు రానున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పి.పి.కుంట వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణా రెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి క్రిష్ణ, కలసపాడు జెడ్పీటీసీ గురివి రెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రయోజనమే లక్ష్యంగా ప్రాజెక్టులు



ఆచార్యుల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ కె.కృష్ణారెడ్డి

వైవీయూ : విద్యార్థుల భవిష్యత్ ప్రయోజనమే లక్ష్యంగా ప్రాజెక్టుల రూపకల్పన చేయడం జరిగిందని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శనం మేరకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ' కార్యక్రమంలో భాగంగా పలు ప్రాజెక్టుల ప్రతిపాదనల తయారీపై వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మలు విశ్వవిద్యాలయ ఆచార్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయం, పునరుత్పాదక శక్తి వనరులు, సుపరిపాలన రాజకీయ నాయకత్వం, సహజ విపత్తులు, రుతుపవనాలు అనే అంశాలపై ప్రాజెక్టులను ఆచార్యులు చంద్రఓబులరెడ్డి, డాక్టర్ టి.చంద్రశేఖర్, డాక్టర్ డి.ఆర్. సతీష్‌బాబు తయారు చేశారు. ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నత విద్యా మండలికి పంపించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఐటీ సెల్ డైరెక్టర్ శివప్రతాప్, డీఓఏ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు, ఆచార్య జయరాజు, ఆచార్య సునీత, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసగౌడ్, డాక్టర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా ఆదాయం రూ. 1.02 కోట్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగను పురస్కరించుకుని ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు వివిధ ప్రాంతాలకు రాను, పోను 390 ప్రత్యేక బస్సులను 1,28,884 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ.1,02,84,721 ఆదాయం ఆర్జించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీని ఆదరించి అందులో ప్రయాణించి అధిక ఆదాయం వచ్చేందుకు తోడ్పడిన ప్రయాణికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇందుకు సహకరించిన అధికారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందిని అభినందించారు.

రూట్	బస్సులు	ఆదాయం
విజయవాడ	53	1753370
బెంగళూరు	128	3048665
హైదరాబాదు	99	3071411
చెన్నై	22	656374
తిరుపతి	51	1006366
కర్నూలు	08	152956
ఇతర ప్రాంతాలు	29	592404
మొత్తం	390	10284721



క్రీడా పాఠశాలలో ప్రవేశాలు ఎప్పుడో?

రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. ప్రతియేటా పాఠశాల ప్రారంభమయ్యే జూన్, జులై నెలల్లో ఎంపికల ప్రక్రియ పూర్తి చేసే శాప్ అధికారులు ఈ యేడాది ఎంపికల ఊసే మరిచిపోయారు. దీంతో అక్టోబర్ నెల గడుస్తున్నప్పటికీ ఇంకా ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

- ప్రారంభం కాని వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రవేశ ఎంపికలు
- 5 నెలలు గడుస్తున్నా జారీ కాని నోటిఫికేషన్
- త్వరితగతిన ఎంపికలు నిర్వహించాలని తల్లిదండ్రుల వేడుకోలు



డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల



కడప స్పోర్ట్స్: కడప నగరంలో 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రాంతీయ క్రీడా పాఠశాలగా పురుడు పోసుకుంది. అనంతరం స్వయం ప్రతిపత్తి సాధించడంతోపాటు ప్రస్తుతం రాష్ట్రంలోని ఏకైక క్రీడా పాఠశాలగా వెలుగొందుతోంది. ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పతకాల పంట పండించారు. అంతటి ప్రాధాన్యత కలిగిన క్రీడా పాఠశాలలో ప్రవేశాలు అంటే ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశం. అయితే పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నెలలు గడుస్తున్నా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ప్రవేశాలు పొందాలనుకుంటున్న విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా మారింది.
- ప్రతియేటా డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం జూన్ లేదా జూలై నెలల్లో నోటిఫికేషన్ జారీ చేస్తారు. బాలుర విభాగంలో 20, బాలికల విభాగంలో 20 సీట్లకు ఎంపికలు నిర్వహించి ప్రవేశాలు చేపడతారు. ఈ ఎంపికల ప్రక్రియ మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో మూడు దశల్లో నిర్వహించి అందులో అర్హత సాధించిన వారికి మెడికల్ ఫిట్‌నెస్ నిర్వహించి చివరగా 4వ తరగతిలో ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. ఈ ప్రక్రియ అంతా జరగడానికి రెండు నెలల సమయం పడుతుంది. అయితే ఈ యే డాది అక్టోబర్ నెల గడుస్తున్నా ఇంకా నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు అటు రెగ్యులర్ స్కూల్‌కు వెళ్లలేక.. ప్రవేశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

దాదాపు 70 ఖాళీలకు ఎంపికలు
4వ తరగతిలో 20 బాలురు, 20 బాలికలు చొప్పున ప్రవేశాలు నిర్వహించాల్సి ఉంది. వీటితో పాటు 5 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థుల్లో కొందరు వెళ్లిపోవడం, మరికొందరు ఆశించిన సామర్థ్యాలు లేకపోవడంతో దాదాపు 26 ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో రెగ్యులర్ ప్రవేశాలతో పాటు ఖాళీగా ఉన్న సీట్లకు లేటరల్ ప్రవేశాలు నిర్వహించాల్సి ఉంది. దీనికి తోడు ఈ యేడాది జూన్ నాటికి ఫుడ్ టెండర్ దారుల గడువు ముగిసినప్పటికీ బకాయిలు చెల్లించకపోవడంతో భోజనశాల నిర్వాహకులు సైతం విద్యార్థులకు భోజనం అందించే విషయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలస్యం.. వెనుక నిర్లక్ష్యం..
జూన్, జూలై నెలల్లో జారీ కావల్సిన నోటిఫికేషన్ దాదాపు 5 నెలల పాటు ఆలస్యం కావడం వెనుక క్రీడాపాఠశాలలో పనిచేసి ప్రస్తుతం శాప్ కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి ఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఈ యేడాది ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తామని చెబుతూ మరింత జాప్యం చేస్తున్నారని శాప్ వర్గాలు పేర్కొంటుండటం గమనార్హం. ఈ కారణంగానే ప్రతియేటా రెగ్యులర్‌గా జరగాల్సిన ఎంపికలు దాదాపు 5 నెలల పాటు ఆలస్యమయ్యాయని, ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా.. మరో నెల నుంచి రెండు నెలల సమయం పట్టే అవకాశం లేకపోలేదని నిపుణులు పేర్కొంటున్నారు.

త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు



క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ యేడాది ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులు, స్క్రూటినీ తదితర అంశాలన్నింటినీ ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమైంది. టెండర్ గడువు ముగిసినప్పటికీ భోజన విషయంలో విద్యార్థులు ఇబ్బంది పడకూడదని పాత కాంట్రాక్టర్‌ను ఒప్పించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం.
- కె. జగన్నాథరెడ్డి, ప్రత్యేకాధికారి, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప

అభ్యంతరాలను తెలపాలి
కడప ఎడ్యుకేషన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో(కేజీబీవీ) ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నవారి మెరిట్ జాబితాను www.kada pa.doe.in వెబ్‌సైట్ లో ఉంచినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ జాబితాను కడప డీఈఓ కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయ నోటీసు బోర్డులలో కూడా పొందు పరిచినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా సమగ్రశిక్ష అధికారికి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 లోపు అందచేయాలన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న మిట్టా క్రిష్ణయ్య

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూలై నుంచి అమలులోకి రావాల్సిన 12వ వేతన సమరణ ఆలస్యం అవుతున్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోపూరి శివారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిర్వహించనున్న ఎఫ్ఎల్ శిక్షణను జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలన్నారు. రెండు, మూడు జిల్లాలకు కలిసి ఒకే చోట ఏర్పాటు చేయడం వల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అంగవైకల్యం కలిగిన వారు, చిన్న పిల్లల కలిగిన మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ ఏపీ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కందుల సుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు ఐ.రామమూర్తి, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యదర్శి రామాంజనేయులరెడ్డి, సికెదిన్నె మండల అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్చక పరీక్షల దరఖాస్తులకు గడువు పెంపు

కడప కల్చరల్ : రాష్ట్ర దేవదాయ శాఖ త్వరలో నిర్వహించనున్న అర్చక పరీక్షల దరఖాస్తులకు గడువు పెంచినట్లు ఆ శాఖ రాష్ట్ర కమిషనర్, ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రేయబాబు, కార్యదర్శి పెద్దింటి రాంబాబు, సహ కార్యదర్శి కేహెచ్ విజయ్ భట్టర్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన మేరకు సెప్టెంబరు 20తో గడువు ముగిసినా మళ్లీ గడువు పెంచిన కారణంగా అక్టోబరు 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. దరఖాస్తులను ఏపీఈఎన్‌డీటీఎస్.అర్చక ఎగ్జామినేషన్స్.కామ్ వెబ్‌సైట్‌లో పంపాలని సూచించారు.

సీఎఫ్‌ఎంఎస్ ద్వారా లైసెన్స్ రుసుము చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని కర్మాగారాలు యాజమాన్యాలు 2025వ సంవత్సరానికి సంబంధించిన నిర్ణీత లైసెన్స్ రుసుమును డిసెంబరు 31వ తేదీ లోగా సీఎఫ్‌ఎంఎస్ ద్వారా చెల్లించి చలానా తమ కార్యాలయంలో సమర్పించాలని కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ ఫీజులలో, హెడ్ ఆఫ్ అకౌంట్, డీడీఓ కోడ్‌లలో ఎలాంటి మార్పు లేదన్నారు. ఫ్యాక్టరీలో అదనంగా హార్స్ పవర్ బిగించినా, అదనంగా ఉద్యోగులను నియమించుకున్నా ఆ ప్రకారం బ్యాలెన్స్ లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తికి 91603 83971, 92958 50949 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈగల్ డిస్టిలరీస్‌లో సీఐడీ దాడులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలో ఉన్న ఈగల్ డిస్టిలరీస్‌లో సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిస్టిలరీస్‌లలో సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలిసి ఈ దాడులు కొనసాగించారు. రికార్డులను పరిశీలించి కొన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తయారు చేసే పదార్థాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు సమాచారం. గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఈ డిస్టిలరీస్‌లో తనిఖీ నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలున్నాయా?

- మహిళలకు రక్షణ ఎక్కడ?
- దిశా చట్టం, దిశా యాప్ ఏమైంది?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? అసలు మహిళలకు రక్షణ ఉందా? మహిళల రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశా చట్టం, దిశా పోలీస్ స్టేషన్లు, దిశా యాప్‌లు ఏమయ్యాయి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. కమలాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి జిల్లాలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, దోపిడీలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 ఘటనలు జరిగినట్లు గుర్తించారని, ఇందులో 6 హత్యలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవమాన భారంతో మరో ఐదారుగురు మహిళలు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. మొన్న బద్వేలు, నిన్న శ్రీకాకుళం ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పాత కేసులు తిరగదోడడం, సెక్షఅక్రమ కేసులు బనాయించడంపై పోలీసులకు ఉన్న శ్రద్ధ మహిళలను రక్షించడంలో లేదన్నారు. ఎటు చూసినా ఇసుక, మట్టి, మైనింగ్, మద్యం దోచుకోవడమే కూటమి నేతల పనిగా మారిందని దుయ్యబట్టారు. ఆడపిల్లల హత్యలు, ఆత్మహత్యల మీద అరిచే పవన్ కళ్యాణ్‌కు టీడీపీ స్క్రిప్ట్ రాయనందునే ఏమీ మాట్లాడలేకపోయారని ఎద్దేవా చేశారు. త్వరలో జమిలి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అప్పుడు టీడీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రవీంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి, హిదాయత్, చెన్నకేశవరెడ్డి, శరత్‌బాబు, కొండా రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ఇర్ఫాన్, మోనార్క్, రామసుబ్బారెడ్డి, మైసూరారెడ్డి, సుబ్బన్న, జెట్టి నగేష్, ఖాజా హుసేన్, సురేష్, చంద్రపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వినికిడి లోపం' మెడికల్ క్యాంపునకు స్పందన

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో, దీన్ దయాల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రిమ్స్‌లో వినికిడి లోపం గల వారికి నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. 0–19 సంవత్సరాల పిల్లలకు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 122 మందికి వినికిడి యంత్రాలు అవసరమని గుర్తించారు. సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవితేజ, డాక్టర్ వంశీధర్, డాక్టర్ ఫరూక్, ప్రతాప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


అండర్-14 బాలుర జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలోని క్రికెట్ నెట్స్‌లో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ క్రీడల్లో క్రేజీ క్రీడ క్రికెట్ అని, ఈ క్రీడలో రాణించే వారికి చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్–17 బాలబాలికలు, అండర్–14 బాలుర జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్‌చక్రవర్తి, ఇజ్రాయిల్, చక్రపాణి, చంద్రావతి, నిత్యప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రికెటర్లు..

అండర్–14 బాలుర జట్టు : సూర్యతేజారెడ్డి, ఉమర్ సిద్దిక్, ఇర్ఫాన్, శరణ్యారెడ్డి, భానువర్షిత్‌రెడ్డి, శివచరణ్, రామ్‌చరణ్, ఇంద్రనీల్‌కుమార్, దినకర్, మోక్షాగౌడ్, చేతన్‌రెడ్డి, ప్రతీష్‌రెడ్డి, సాయినందన్, ఖలీద్, ఇస్మాయిల్, అబూబకర్.

అండర్–17 బాలుర జట్టు : కృష్ణ, సాయిసాకేత్, గైబు, అహ్మద్‌అమీన్, లక్షిత్, కిశోర్, కుల్లాయప్ప, రాజేంద్ర, వెంకటసాయి, విష్ణుసాయి, సల్మాన్, రిహాన్, భార్గవ్‌రెడ్డి, జయభాస్కర్‌రాజు, గిరీష, చైతన్య.

అండర్–17 బాలికలు : నితీషా, అఫ్షియా సుల్తానా, కుశాల్‌సాయి, హరిణి, భవ్యశ్రీ, సంజీవతనుశ్రీ, శ్రీవల్లి, రేష్మా, అక్షయరెడ్డి, ప్రియాంక, భవ్య, లిఖితారెడ్డి, ఆదిలక్ష్మి, జ్యోతి, తేజస్విని, మౌనిక.

ఎస్‌జీఎఫ్ జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక


జిల్లా అండర్-14 కబడ్డీ బాలుర జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్–14 కబడ్డీ బాలబాలికల ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కిరణ్, తిరుపాల్‌రెడ్డి, సుబ్బయ్య, చంద్ర ఓబులరెడ్డి, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 బాలికలు : వెంకటఅక్షయ, అపర్ణ, నిరుప, గంగాదేవి, సంజన, సన్నీ, మోక్షిత, జోత్స్న, కుసుమ, ప్రణతి, భవిత, సుప్రజ.

అండర్–14 బాలురు : జనార్దన్, వెంకటవిశాల్, ఉస్మాన్, ఎస్. హర్షవర్ధన్, నరేంద్ర, బి. హర్షవర్ధన్, గంగాధర్, అంజన్‌కుమార్, నందకిశోర్, సురేంద్ర, చరణ్, ప్రశాంత్.

జిల్లా ఖోఖో జూనియర్ విభాగం జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని బయనపల్లె ఎస్.వి. హైస్కూల్‌లో నిర్వహించిన ఖోఖో ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లను జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, కార్యదర్శి జి. నరేంద్ర మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డయ్య, కృష్ణయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బాలికల జట్టు : పి.సాయిహారిక, పి. వనిత, జి.మేర మ్మ, వై.అశ్విని, కె.స్వాతి, జి.హరిత, జి.శివాణి, ఎస్. సన్నీ, కె.లోహిత, ఎం. సింధూరి, జె.నందిని, బి.రెడ్డిగీ త, జె.యోగరాయల్, డి.యాస్మిన్, ఎస్.గంగాదేవి.

బాలుర జట్టు : కె. నిఖిల్, కె.మహేష్, ఎ.సందీప్, ఎస్.చిన్నికృష్ణ, బి.యతీష్, పి.అయ్యబాబు, పి.వెంకటేష్, ఎ.ఇంద్ర, కె. అశోక్, ఇ.గణేష్, ఎస్.యూసుఫ్‌బీ, కె. వెంకటచరణ్, బి.వీరేష్, బి.రాఘవ, కె.పి.చంద్రమౌళి.

ఎస్‌జీఎఫ్ జట్లు ఎంపిక..

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా ఖోఖో అండర్–14, అండర్–17 జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రకటించారు. సోమవారం బయనపల్లె ఎస్.వి.హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్–17 బాలురు : యతీష్, గణేష్, సంజీవరాయుడు, వెంకటసుశాంత్, మహబూబ్‌బాషా(పోట్లదుర్తి), చంద్రమౌళి, దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, మహబూబ్‌బాషా (ముక్కావారిపల్లె), సుదర్శన్, సతీష్, గురుకిరణ్.

అండర్–17 బాలికలు : అశ్విని, రెడ్డిగీత, దర్శిణి, కావ్య, సోని, ప్రసన్న, రహేనాబీ, చైత్ర, చాతుర్య, రెడ్డిప్రియ, దేవి, నాగనిష్ఠ.

అండర్–14 బాలురు : హరిత, తనూశ్రీ, సాహితి, అమృత, లాల్‌బీ, హాసిని, చంద్రిక, అనుపమ, శ్రీనిజ, ఆయేషా, ఆర్షియా, స్వాతి.

అండర్–14 బాలురు : రాఘవ, మహేష్, చరణ్‌తేజ, ముఖేష్, సాయికృష్ణ, శివకేశవ, వికాస్, ప్రేమ్‌చంద్, చరణ్, నాగచైతన్య, ఉదయ్‌కిరణ్, హుసేన్‌బాషా.

వ్యక్తి దారుణ హత్య

చిన్నాన్నను కత్తితో పొడిచి పరారైన యువకుడు


మృతుడు వెంకటసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్/గోపవరం : గోపవరం మండలం శ్రీనివాసపురం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసి ఓ యువకుడు పరారయ్యాడు. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే... శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి(48) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఈయనకు భార్య విజయలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఈయన భార్య స్వయానా అక్క తిరుపతమ్మ కూడా అదే గ్రామంలో నివసిస్తుండేది. అయితే తిరుపతమ్మ కుమారుడు తిప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి మద్యానికి బానిసై తరచూ తల్లితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా భాస్కర్ రెడ్డి తల్లితో గొడవకు దిగాడు. దీంతో భయంతో తిరుపతమ్మ సమీపంలోని తన అక్క అయిన విజయలక్ష్మి ఇంటికి వెళ్లి తల దాచుకుంది. విషయం తెలుసుకున్న భాస్కర్‌రెడ్డి తన చిన్నాన్న ఇంటి వద్దకు వెళ్లి తన తల్లిని బయటకు పంపమని గొడవ చేశాడు. ఈ సమయంలో వెంకటసుబ్బారెడ్డి ఇంటి నుంచి బయటకు వచ్చి ఏందిరా ఇది రోజు తాగి వచ్చి గొడవ చేయడం ఏమైనా బాగుందా అంటూ భాస్కర్‌రెడ్డిని మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడైన భాస్కర్‌రెడ్డి తనతో పాటు తెచ్చుకున్న కత్తితో వెంకటసుబ్బారెడ్డి ఛాతీలో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు.దీంతో తీవ్ర గాయాలపాలైన వెంకటసుబ్బారెడ్డిని కుటుంబ సభ్యులు బద్వేలులోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు నిందితుని కోసం గాలిస్తున్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

– జిల్లా ఫారెస్టు అధికారులతో డీఎఫ్ఓ సమీక్ష

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, అటవీ సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలో ఉన్న ఉప అటవీ అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫారెస్టు ప్రొటెక్షన్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎకో టూరిజం, నగరవనం, అరణ్య పార్కు అభివృద్ధి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఫారెస్టు అభివృద్ధి, భద్రతపై ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

– ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయ్ కుమార్

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఇడుపులపాయ, ఒంగోలు, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఉన్న మెస్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులతో మెస్ యాజమాన్యం అందిస్తున్న ఆహారంపై అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాసిరకమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తే అలాంటి మెస్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. మెస్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆర్జీయూకేటీ ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందివ్వాలన్నారు. ఆయన వెంట డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అటవీ అధికారుల ఆరా

వేముల : మండలంలోని పెండ్లూరు చెరువు పరిసర ప్రాంతాలలో చిరుత పులుల సంచారంపై ముద్దనూరు అటవీ శాఖ అధికారులు ఆరా తీశారు. చెరువు పరిసర ప్రాంతాలలో గత రెండు రోజులుగా చిరుత పులులు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీఓ పద్మనాభయ్య, వీఆర్ఓ రమాదేవిలు చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే చిరుత పులులు కనిపించిన విషయమై గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. ఈ ప్రాంతంలో చిరుత పులులు సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. గొర్రెలు మేపుకుంటుండగా బెదిరిపోయి పారిపోవడంతో చిరుత పులి సంచరించిందన్న అనుమానం వ్యక్తం చేశారన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.చాణక్య అండర్–14 జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిష తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న చాణక్యను మదర్ గ్రేసీతో కలిసి ప్రశంసించారు. చదరంగం ఆటలో మెలకువలు నేర్పించి విద్యార్థి విజయానికి కారణమైన ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌మోహన్‌ను అభినందించారు.

చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి


నరసింహులు(ఫైల్)

దువ్వూరు(చాపాడు) : మండల పరిధిలోని నీలాపురం గ్రామానికి చెందిన వనిపెంట నరసింహులు((36) అనే వ్యక్తి మద్యం మత్తులో చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు.. నీలాపురం గ్రామానికి చెందిన వనిపెంట నరసింహులు ఇదే గ్రామానికి చెందిన శ్రీరాములుతో కలసి బైక్‌పై సోమవారం ఉదయం పని నిమిత్తం వనిపెంటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లే క్రమంలో ఇద్దరు కలసి మద్యం తాగారు. మార్గమధ్యంలో నీలాపురం సమీపంలోని హైస్కూల్ వద్ద బైక్ ఆపి తాను చెరువులోకి వెళ్లి స్నానం చేసి వస్తానని నరసింహులు చెరువులోకి దిగాడు. ఈ సమయంలో శ్రీరాములు బైక్‌పై ఇంటికి వెళ్లిపోయాడు. చెరువులోకి స్నానానికి వెళ్లిన నరసింహులు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం నరసింహులు శవమై తేలాడు. ఈ ఘటనపై మృతుడి భార్య నాగ రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐఓక్యూఎంకు కడప నారాయణ విద్యార్థి ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైడ్ ఇన్ మ్యాథమ్యాటిక్స్(ఐఓక్యూఎం) పరీక్షా ఫలితాల్లో కడప ఎన్‌జీఓ కాలనీలోని నారాయణ సీఓ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్‌పీ ప్రవీణ్ తొలి దశకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ ఎస్.షరీఫ్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో ప్రవీణ్ 109వ ర్యాంకు సాధించాడన్నారు. విద్యార్థికి ప్రైజ్ మనీ కింద రూ. 3 లక్షలు వస్తుందన్నారు. ఐఓక్యూఎంకు ఎంపికై న విద్యార్థిని, అలాగే మ్యాథ్స్ టీచర్ శంకర్‌ను నారాయణ పాఠశాలల ఏజీఎం శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తోడ్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పోలీసు శాఖలో విశేష సేవలు అందిస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐ వై.సుబ్బారాయుడు సతీమణి వై.వెంకటలక్ష్మికి కార్పస్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును మంగళవారం అదనపు ఎస్పీ అందజేశారు. మృతుని కుటుంబ యోగ క్షేమాలు విచారించారు. శాఖాపరంగా ఎలాంటి అవసరమున్నా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి పాల్గొన్నారు.

దస్తగిరమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్ : ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రామాంజనేయనగర్‌లో దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారికి కఠిన శిక్షలు పడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దస్తగిరమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించాలని కోరారు.